క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : మండల పరిధిలోని పరిధిలో వివిధ గ్రామాలకు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ మెయింటనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని త్రిపురారం విద్యుత్ ఏఈ రవీందదర్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ అవుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా సాయినాథుడి దేవాలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయ 17వ వార్షికోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో గణపతి గౌరి పూజ, హోమం, ధ్వజారోహన, గోపూజ, అఖండ దీపారాధన, గణపతి నవగ్రహ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వార్షికోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయడానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు గ్రామ స్థాయినుంచి ప్రజలను సమీకరించేందుకు సన్నాహక కవాతు నిర్వహించాలన్నారు.గ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, కొంపెల్లి విశ్వపతి, ఏడుకొండలు, మేడి శంకర్, కొమిరెస్వామి, శ్రీనివాస్, యాదయ్య, శ్రీనివాసులు, కమలమ్మ, మోహన్, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు, ఏడు మొరం ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా డిండి చింతపల్లి వాగు నుంచి వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లి, ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్ గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం రాత్రి మండల కేంద్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అదే సమయంలో మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులోంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏడు ట్రాక్టర్‌లలో డిండి పట్టణానికి మొరం తరలిస్తున్నారు. ఈ క్రమంలో అప్పటి వరకే సమాచారం తెలుసుకున్న ఎస్ఐ.రాజు తన సిబ్బందితో కలిసి దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్‌లు, ఏడు మొరం ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌లను స్థానిక తహసీల్దార్‌కు బైండవర్ చేసి ఇసుక ట్రాక్టర్లపై కేసు నమెదు చేసకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

26, 27 తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ టౌన్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఈ నెల 26, 27 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో శ్రీను, మల్లన్న, శివకుమార్, విజయ్‌కుమార్, మల్లయ్య, రాధిక పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ టి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు మిషన్ భగీరథ నీటి సరఫరాపై జరిపే ఇంటింటి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అజీజ్, వెంకటేశ్వరరావు, వివిధ మండలాల ఎంపీడీలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల తిష్ట

- కార్యాలయంలో రెండేళ్లుగా పనిచేయని ప్రింటర్
- పక్క మండలాలకు వెళ్లి ప్రింట్ తీసుకొస్తున్న సిబ్బంది
- ఏ ఉద్యోగి ఏ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని పరిస్థితి


కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం

కొండమల్లేపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటర్ రెండేళ్లుగా పనిచేయడం లేదు. రెండేళ్ల కిందట ప్రింటర్ మరమ్మతులకు గురైతే పట్టించుకునే వారు కరువయ్యారు. రైతుల భూముల రిజిస్ట్రేషన్ సమయంలో వివరాలు ప్రింట్ తీయడానికి ప్రింటర్ అవసరం. కానీ రైతులు తమ పాస్ బుక్‌లో వివరాలను నమోదు చేసుకోవడానికి పక్క మండలాలలకు వెళ్లి ప్రింట్ తీసుకొని వస్తున్నట్లు సమాచారం. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఒకింత శోచనీయంగా చెప్పొచ్చు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయాన్ని సరిదిద్దవలసిన అవసరం ఎంతైన ఉంది.

సరిపడా సిబ్బంది ఉన్నా..

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గల స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలను వీఆర్ఓలుగా ప్రమోట్ చేసిన తర్వాత కావాల్సినంత సిబ్బంది ఇక్కడ ఉన్నారు. కానీ ఏ ఉద్యోగి ఏ విధులు నిర్వర్తిస్తున్నారు అనేది మాత్రం ప్రశ్నార్థకం. ముఖ్యంగా కల్యాణ లక్ష్మికి సంబంధించిన వివరాలు గాని ఓ.బి.సి, ఈడబ్ల్యూఎస్ మరియు వ్యవసాయ సంబంధిత విషయాలు కుల ధ్రువీకరణ పత్రాలు పలు అంశాలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులకు ఓ ప్రత్యేకమైన జాబ్ చాటు అనేది లేదు. ప్రజలు తమ అవసరాల కోసం కార్యాలయానికి వచ్చినప్పుడు ఒకరిపై ఒకరు చెప్పుకొని అటు ఇటు తిప్పడం తప్ప ప్రజల అవసరాలు తీర్చకపోవడం గమనార్హం. అంతేగాక ఇక్కడ పనిచేసే సిబ్బందికి సమయ పాలన కూడా సరిగా పాటించరని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పలువురు కోరుతున్నారు.

పక్క మండలాలకు వెళ్లాలి

తహసీల్దార్ కార్యాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చి రైతుల పాస్ బుక్‌లు ప్రింట్ ఇవ్వడానికి ప్రింటర్ పని చేయడం లేదని అధికారులు అంటున్నారు. అవసరమైన ప్రింట్‌ను పక్క మండలాలకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇది రైతులకు అదనపు ఖర్చుగా మారింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయానికి వెళ్తే తిప్పించుకుంటున్నారు.

– ఎస్.యాదగిరి, కొండమల్లేపల్లి

ఉన్నతాధికారులు స్పందించాలి

కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పని నిమిత్తం వివిధ గ్రామాల నుంచి రైతులు, విద్యార్థులు పలువురు వస్తున్నప్పటికి అధికారులు నుంచి సరైన పనులు కావడం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఎవరి వద్దకు ఏ పనికి వెళ్లాలో కూడా అర్థం కాని తికమక పరిస్థితి. ఉన్నతాధికారులు కాస్త స్పందించి సకాలంలో పనులు జరిగేలా చూడాలి.

– మూఢావత్ వెంకటేష్‌నాయక్, రైతు, బుడ్డోనితండా, కొండమల్లేపల్లి

బుద్ధవనాన్ని సందర్శించిన సాగర్ ఎమ్మెల్యే


బుద్ధవనం వెనుక జలాల వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శుక్రవారం బుద్ధవనాన్ని సందర్శించారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాగార్జునసాగర్‌లోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసేందుకు శనివారం నాగార్జున సాగర్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఎమ్మెల్యే బుద్ధవనంలోని పలుప్రాంతాలను సందర్శించారు. బుద్ధవనం వెనుకభాగాన జలాశయంతీరంలో ఏర్పాటు చేస్తున్న వ్యూపాయంట్‌ను పరిశీలించారు. మహాస్థూపం అంతర్భాగం రెండో అంతస్తులోని అష్టబుద్ధుల గల ప్రాంతాన్ని సందర్శించారు. అలాగే బుద్ధవనంలోని జాతక పార్కు, స్థూపా పార్కు తదితర విభాగాల్లో అభివృద్ధి చేయాల్సిన వాటి గురించి స్థానికులతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ యన వెంట స్థానిక నాయకులు రాజాప్రసాద్, సుమో వెంకటేశ్వర్లు, ఉంగరాల శ్రీను, సూపర్‌వైజర్ నర్సింహారావు తదితరులు ఉన్నారు.

నేడు పర్యాటక శాఖ మంత్రి పర్యటన

తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు శనివారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం బౌద్ధవారసత్వ థీమ్‌పార్కును సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 9గంటలకు సాగర్‌కు చేరుకోనున్నారు. బుద్ధవనంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించడంతో పాటు పర్యాటక శాఖ అధికారులతో బుద్ధవనంపై మంత్రి సమీక్ష నిర్వహించనున్నట్లుగా అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆరీఫ్

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ అన్నారు.పట్టణంలోని కేవీఆర్ ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆరీఫ్ మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించనున్న జవహర్ నవోదయ ఎంట్రన్స్‌లలో ఆరో తరగతిలో ప్రవేశానికి కేవీఆర్ కోచింగ్ సెంటర్ కూడా ఉందన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్, పుష్పలత, సైదులు, నసరుద్దీన్, స్వప్న, వంశీ, పావని, శివ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు


త్రిపురారంలో సంబరాలు చేసుకుంటున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

త్రిపురారం : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శుక్రవారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించాడు. దీంతో త్రిపురారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చుతూ స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆలంపల్లి జానయ్య, పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పీబీ రవి, ప్రధాన కార్యదర్శి సలికంటి బాలకృష్ణ, కోఆప్షన్ షేక్ హుస్సేన్, అవిరెండ్ల వీరయ్య, పండు, గోవిందు, రవి, శ్యాంసుందర్ రెడ్డి, కిరణ్, నాగరాజు, ఏడుకొండలు, నిఖిల్, కమల్, చింటు, మైసూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లికల్లు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం తమ ప్రభుత్వం ప్రణాళికలను తయారుచేస్తుందన్నారు. బడుల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రజాప్రతినిధుల నిధుల నుంచి నలభైశాతం నిధులను కేటాయించి, ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతేడాది విద్యార్థులు లేకపోవడంతో నెల్లికల్లు జెడ్పీ పాఠశాల మూతబడిందని దానిని తిరిగి పునఃప్రారంభించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణానాయక్, ఎంఈవో తరి రాము, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మిర్యాలగూడ : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని 35వ వార్డు కౌన్సిలర్ కొమ్ము శ్రీనిసవాస్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా 35వ వార్డులో మండల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రికార్డుల తనిఖీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో శుక్రవారం సమాచార హక్కు కార్యకర్తలు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ రాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 2 (జే)స మాచార హక్కు ప్రకారం ప్రతి ఒక్క పౌరుడికి ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ నిర్వహించవచ్చన్నారు. తనిఖీల సమయంలో అవసరమైన సమాచారాన్ని ధ్రువీకరించుకోని తీసుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. ప్రతి ఒక్క రూ హక్కుల చట్టాల గురించి వివరించాలన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కార్యకర్తలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎద్దు ఉపేందర్ కుటుంబానికి టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.లక్షా 20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ సీపీఎస్ పెనుభూతం కారణంగా ఉపేందర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి కనీసం అంత్యక్రియల ఖర్చులుకూడా రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌తో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మక్కా శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శులు మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, చిన్న వెంకన్న, మండల బాధ్యులు కట్ట మధుసూదన్, పాల్వాయి శ్రీనివాస్, ఎం.ప్రతాపరెడ్డి, అనంతరెడ్డి, రాఘవరెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు ఉమా, రవి, శరత్ ఉన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థలో అక్రమ వసూళ్లను అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పలు ప్రైయివేటు విద్యా సంస్థల్లో ఇప్పటికే బెల్ట్‌లు, టైలు, పుస్తకాలు, షూలు అంటే పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని, దీంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో 10శాతం పేదలకు ఉచిత విద్యను అందించాలన్నారు. గుర్తింపులేని పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షులు కొండ జోష్ గౌడ్, రెడ్డిమల్ల నాగరాజు, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి


వేములపల్లి : సత్తిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

త్రిపురారం : గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మాజీ మంత్రి జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హెల్త్‌కేర్ అండ్ డయగ్నొస్టిక్ ఆస్పత్రిని వారు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీపీ అనుముల పాండమ్మ నివాసంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో రఘువీర్ రెడ్డి గెలుపుకు కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతీ, మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, అంబటి రాము, గట్టు యాదగిరి జిల్లా నాయకులు మర్ల చంద్రా రెడ్డి, నరేందర్, నాయిని సంతోష్ కుమార్, మండల మహిళ అధ్యక్షురాలు పద్మ, యూత్ అధ్యక్షుడు పీబీ రవి, సలికంటి బాలకృష్ణ, చిలుముల శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జానారెడ్డి పరామర్శ

వేములపల్లి : మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి తండ్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాలి సత్తిరెడ్డి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జానారెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దైద ధర్మయ్య శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ధర్మయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, నాయకులు పెదవెంకన్న, వెంకన్న, వినోద్, శ్రీను పాల్గొన్నారు.

ఇంకుడు గుంత ఉంటేనే భవన నిర్మాణానికి అనుమతి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో 300 చదరపు గజాల భూమి ఉంటే తప్పని సరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, ఇంకుడు గుంత ఉంటేనే మున్సిపాలిటీలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం అవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీరు నిల్వ ఉండి నీటి ఇబ్బందులు ఉండవన్నారు. ఇంకుడు గుంతలను నిర్మించుకొని వారికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సీపీఎం ఆధ్వర్యంలో రోడ్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు నుంచి పజ్జూరు, మామిడాలకు వెళ్లే రోడ్లను పరిశీలించి మాట్లాడారు. వర్షాల వల్ల రహదారులపై ఏర్పడిన గుంటల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు భీమగాని గణేష్, కన్నెబోయిన శంకర్, పేరం లింగయ్య, ఎన్. లింగయ్య, దొడ్డబోయిన లింగరాజు, సైదులు, రామచంద్ర వెంకులు, ఎల్లమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి రూ.26.72లక్షల ఆదాయం


ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : మండలంలోని కల్లేపల్లి గ్రామంలో బంగారు మైసమ్మతల్లి దేవస్థానంలో వివిధ పూజా సామగ్రి విక్రయించుకునేందుకు నిర్వహించిన వేలంలో రూ.26.72లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో మిర్యాలగూడ డివిజన్ పరిశీలకుడు ఈ.రమేష్ సమక్షంలో వేలం నిర్వహించగా కొబ్బరికాయలు అమ్ముకోవడానికి రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ పున్నానాయక్ రూ.17.80లక్షలకు దక్కించుకోగా పూలు విక్రయించడానికి మాలోతు బీమానాయక్ రూ.2.22లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయించడానికి మాలోతు రవినాయక్ రూ.6.70లక్షలకు దక్కించుకున్నారని, దీంతో ఆలయానికి వేలం ద్వారా రూ.26.72లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా దున్నపోతులు సమకూర్చుకునే హక్కు, కొబ్బరిచిప్పలు సేకరించుకునే హక్కుతోపాటు తలనీలాలు సేకరించుకునే హక్కులకు ఏడాది కంటే తక్కువ పాట వచ్చినందునా ఆ వేలంను ఈనెల 14కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కాగా వేలం సందర్భంగా ఆలయం వద్ద ఎస్ఐ రవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీమా, సోమమ్మ, జానకిరాములు, మాలోతు జనార్దన్, శారదపాచ్చ నాయక్, నెహ్రూనాయక్, వెంకటేశ్వర్లు, రామ్మోహన్, కోటేష్, ఎర్రనాయక్, హజ్మీరా, లింగానాయక్, మేఘా, వాగ్యా, ధీరావత్ లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడులు తెరిచే రోజే యూనిఫాం అందించాలి


ఏపీఎం నుంచి యూనిఫాం స్వీకరిస్తున్న ఎంఈఓ తరి రాము

గుర్రంపోడు : బడులు తెరిచే జూన్ 12వ తేదీనే ప్రతి పాఠశాలలో విధిగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పుస్తకాలు, యూనిఫాం అందించాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో సమభావన సంఘాల వారితో కుట్టించిన యూనిఫామ్స్‌ను ఏపీఎం వి. యాదయ్య నుంచి ఎంఈఓ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తెరిచే నాటికే విద్యార్థులకు అవసరమైన అన్నింటినీ ప్రభుత్వం పంపిణీకి సిద్ధంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుత బడిబాటలో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించి ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలనే చేర్చేలా ప్రోత్సహించాలన్నారు. సోమవారం ప్రతి ఉపాధ్యాయుడు విధిగా యూనిఫామ్స్ తీసుకుని పోయి విద్యార్థులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం యాదయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన భక్తులు

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామంలో వెలసిన లక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి కల్యాణ వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, డప్పు వాయిద్యాలతో మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వేద పండితుల సమక్షంలో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నంద్యాల శ్రీరామ్, మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జిన్నా నాగిరెడ్డి, అవిరెండ్ల వేణు, నాయకులు శీలం శ్రీనివాస్, పిండి సతీష్‌రెడ్డి, జగన్, రాము తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' అమలు చేయాలి

చండూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుల పెట్టుబడి సహాయం కింద అందించాల్సిన రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు కోరారు. శుక్రవారం ఆయన చండూరులో విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటున్నారని, అదే రైతు భరోసా అందిస్తే అప్పులుచేసే బాధ తప్పుతుందన్నారు. అంతే కాకుండా ఆగస్టు 15లోగా చేస్తామని చెప్పిన రైతు రుణమాఫీని కూడా మాట తప్పకుండా అమలు చేయాలని ఆయన కోరారు. పలువురు విత్తనాలు, ఎరువుల వ్యాపారులు అధిక లాభల కోసం ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారని దానిని వెంటనే అరికట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్ కుమార్, జెల్ల శ్రీను, చెడుబుత్తి ఊషయ్య, పరమేష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.